నమస్తే తెలంగాణ
సంగారెడ్డి
I | హైదరాబాద్, గురువారం 3 అక్టోబర్ 2024 | SANGAREDDY

సంగారెడ్డి జిల్లా డప్పూర్ గ్రామ సమీపంలోని చెరువు కింద సాగులో ఉన్న పంట పొలాలు

# డప్పూరు రైతుల పోరుబాట


సంగారెడ్డి జిల్లా డప్పూర్ గ్రామ శివారులోని నిండుగా నీటితో కళకళలాడుతున్న చెరువు

సంగారెడ్డి జిల్లా డప్పూరులో చెక్‌డ్యామ్‌పై నుంచి పొంగిపొర్లుతున్న న్యాల్‌కల్ వాగు

- ఫార్మాసిటీకి పచ్చని భూములా..
- భూములు లాక్కుంటే మేమెలా బతకాలి
- ప్రాణాలు పోయినా ఫార్మాసిటీకి భూములివ్వం
- ప్రభుత్వం ఫార్మాసిటీ ఏర్పాటును విరమించుకోవాలి
- డిమాండ్ చేస్తున్న సంగారెడ్డి జిల్లా డప్పూరు రైతులు

న్యాల్‌కల్, అక్టోబర్ 2: బోరు, బావుల కింద రెండు, మూడు పంటలు పండే పచ్చని భూములను ఫార్మాసిటీకి ఇచ్చేందుకు సంగారెడ్డి జిల్ల న్యాల్‌కల్ మండలంలోని వడ్డి, డప్పూర్, మల్లి గ్రామాలకు చెందిన రైతులు నిరాకరిస్తున్నారు. ఆయా గ్రామాల్లో ఫార్మాసిటీ ఏర్పాటు చేసే పారిశ్రామిక వేత్తల ప్రయోజనాల కోసం ప్రభుత్వం తమ భూములను లాక్కునేందుకు ప్రయత్నం చేస్తున్నదంటూ రైతులు మండిపడుతున్నారు. 2013 భూసేకరణ చట్టం ప్రకారం 90 శాతం భూమి సాగుకు పనికి రాని, 10శాతం భూమి సాగుకు అనుకూలమైనది సేకరించవచ్చని పేర్కొందని రైతులు అంటున్నారు. కానీ, ఫార్మాసిటీ కోసం ప్రతిపాదించిన 2003 ఎకరాల్లో 85శాతం మేరకు సాగుకు అనుకూలంగా, 15 శాతం ఎండు, మూడు పంటలు పంటలు పండే భూములున్నాయని తెలిపారు. తమకు ఉన్న అర ఎకరం, ఎకరా, రెండు ఎకరాలకు పైగా ఉన్న భూములని ప్రభుత్వం ఫార్మాసిటీకి తీసుకుంటే తామెలా బతకాలని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**బోరు, బావుల కింద పంటల సాగు...**

ఫార్మాసిటీ కోసం 2003 ఎకరాల భూమి సేకరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో న్యాల్‌కల్ మండలంలోని మల్లి గ్రామంలో 282.13 ఎకరాలు, వడ్డి గ్రామంలో 256.01 ఎకరాల ప్రభుత్వ, పట్టాభూములను సేకరిస్తున్నది. అయితే డప్పూర్ గ్రామంలోనే అధికంగా రైతులు భూములను కోల్పోతున్నారు. ఈ గ్రామంలో 2800 ఎకరాల భూమి ఉంది. అందులో 920 ఎకరాల ప్రభుత్వ భూమి, 516 ఎకరాల పట్టాభూమిని ఫార్మాసిటీ కోసం సేకరించేందుకు ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్‌ను జారీచేసింది. ఫార్మాసిటీకి సేకరించే భూముల్లోనే రెండు, మూడు పంటలను సాగు చేసుకుంటూ బతుకుతున్నారు. డప్పూర్ గ్రామ సమీపంలోని 80 ఎకరాల విస్తీర్ణంలో చెరువు ఉంది. ఇటీవల కురిసిన భారీ వర్షాలతో వరద చేరడంతో చెరువు నీటితో కళకళలాడుతోంది. చెరువుల పరిధిలో భూగర్భ జలాలు పెరగడంతో 100 బోర్లు, 150 బావుల కింద రైతులు పంటలను పండించుకుంటున్నారు. డప్పూర్ గ్రామ పరిధిలోని 15 వరకు చెక్‌డ్యామ్‌లతో పాటు న్యాల్‌కల్, నక్కల, కోట, చాకలి వాగుల కింద పారే నీటిని పంపు సెట్ల ద్వారా పొలాలకు నీటి తడులను పెట్టుకుంటున్నారు. వ్యవసాయమే జీవనాధారంగా పత్తి, కంది, సోయాబీన్, మినుము, పెసర, మొక్కజొన్న, అలుగడ్డ, ఉల్లిగడ్డతోపాటు కూరగాయలు పండిస్తున్నారు. పాడిపశువులు, మేకలు, గొర్రెల పెంపకంతో జీవనాన్ని సాగిస్తున్నారు. భూమి, నీరు, గాలి కాలుష్యం చేసి తమను కాలుష్య కోరల్లోకి నెట్టే ఫార్మాసిటీ ఏర్పాటుకు ప్రాణాలు పోయినా భూములు ఇచ్చేది లేదని రైతులు ఖరాఖండీగా చెబుతున్నారు. ఫార్మాసిటీతో భూములను కోల్పోవడంతో పాటు బోరు, బావులు పోతాయని, తమ జీవితాలు రోడ్డు పాలవుతాయని, ఈ ప్రాంతంలో కాలుష్యం పెరిగి ప్రజారోగ్యం దెబ్బతింటున్నదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఫార్మాసిటీ ప్రతిపాదన విరమించుకుని తగిన న్యాయం చేయాలని రైతులు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

ప్రాణాలు పోయినా ఫార్మాసిటీకి భూములు ఇవ్వమంటున్న డప్పూరు రైతులు (ఫైల్)

### భూములే జీవనాధారం..

పచ్చని పంటలతో కళకళలాడే భూములపైనే మా కుటుంబం ఆధారపడి ఉంది. మాకు జీవనాధారమైన భూములను ఫార్మాసిటీకి లాక్కుంటే మేం ఎలా బతకాలి. ఏడాదికి రెండు, మూడు పంటలు పండించుకుంటున్నాం. మాకు ఉన్న ఐదు ఎకరాలను ఫార్మాసిటీకి తీసుకుని పొట్ట కొట్టొద్దు. మా భూముల్లో ఫార్మా కంపెనీలు పెట్టి మమ్మల్ని ఇబ్బందులు చేయద్దు. ఫార్మాసిటీ ఏర్పాటును ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలి

**- పండరి, రైతు, డప్పూర్, న్యాల్‌కల్ మండలం, సంగారెడ్డి జిల్లా**

## భారీ వర్షంతో ఊరట

సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లోని అంబేద్కర్ చౌరస్తాలో రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

చేర్యాల, అక్టోబర్ 2 : కొన్ని రోజుల నుంచి ఉక్కపోతతో ఇబ్బందులు పడుతున్న ప్రజలకు బుధవారం సిద్దిపేట జిల్లా చేర్యాల ప్రాంతంలో కురిసిన వర్షంతో ఒకింత చల్లబడ్డారు. ఉదయం నుంచి నిప్పులు కక్కుతున్న సూర్య భాగవానుడు చల్లబడడంతో మధ్యాహ్నం ఒక్కసారిగా మబ్బులు ఏర్పడి గంటపాటు చేర్యాల ప్రాంతంలో భారీ వర్షం కురిసింది. చేర్యాల పట్టణంతో పాటు పలు గ్రామాల్లో వర్షం పడటంతో మొదటి రోజు ఎంగిలి పూల బతుకమ్మ వేడుకలకు అవాంతరం ఏర్పడింది. పట్టణంలోని వివిధ కాలనీల్లో బతుకమ్మ ఆడుకునేందుకు ఉదయాన్నే స్థలాన్ని చదును చేయించి మ్యాట్స్ వేశారు. ఒక్కసారిగా వర్షం పడటంతో మ్యాట్ తడిచి మహిళలు ఒకింత అసహనానికి గురయ్యారు. ఇది ఇలా ఉండగా చేర్యాల అంగడి బజారు, గాంధీ సెంటర్ తదితర ప్రాంతాల్లో వరద చేరి రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడ్డాయి.

**హుస్నాబాద్‌లో ...**

హుస్నాబాద్, అక్టోబర్ 2: సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణంతో పాటు చుట్టుపక్కల గ్రామాల్లో బుధవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు తీవ్రమైన ఎండ, ఉక్కపోతతో ఇబ్బందులు పడ్డ ప్రజలకు వర్షం పడటంతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. సాయంత్రం సుమారు గంట పాటు వర్షం వచ్చింది. ఇదే సమయంలో ప్రారంభమయ్యే ఎంగిలిపూల బతుకమ్మ వేడుకలకు అంతరాయం ఏర్పడింది. అనంతరం వర్షం కొంత తగ్గినప్పటికీ బతుకమ్మ వేడుకలు అంతంతమాత్రంగానే జరిగాయి. ఉరుములు, మెరుపులతో కురిసిన భారీ వర్షం వల్ల లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పట్టణంలోని మెయిన్‌రోడ్డు, అంబేద్కర్ చౌరస్తా, మల్లెచెట్టు చౌరస్తా మొత్తం చిన్నపాటి వాగును తలపించాయి. గడిచిన నాలుగు రోజులుగా ఉక్కపోతతో ఉక్కిరి బిక్కిరి అయిన జనం భారీ వర్షంతో కొంత సేదతీరినట్లయింది.

**సంగారెడ్డిలో..**

సంగారెడ్డి కలెక్టరేట్, అక్టోబర్ 2: సంగారెడ్డిలో మంగళవారం రాత్రి భారీ వర్షం కురిసింది. జిల్లాలో అత్యధికంగా సంగారెడ్డిలో 107.8 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. జిల్లాలో సరాసరి వర్షపాతం 15.1 మిల్లీ మీటర్లుగా నమోదైంది. మొగుడంపల్లిలో 98.1 మి.మీ, హత్నూరలో 61.7మి.మీ, జహీరాబాద్‌లో 31.4మి.మీటర్ల భారీ వర్షం కురవగా, పటాన్‌చెరు, కంది, గుమ్మడిదల, కోహీర్, మునిపల్లి, న్యాల్‌కల్, చౌటకూర్, పుల్కల్ మండలాల్లో మోస్తరు వర్షం కురిసింది, మరి కొన్ని ప్రాంతాల్లో చిరు జల్లులు పడ్డాయి. భారీ వర్షాలకు అన్నదాత కుదేలవుతున్నాడు. వర్షాలు తగ్గాయనుకుంటున్న సమయంలో మరోసారి భారీ వర్షాలు పడటంతో పత్తి రైతులు బెంబేలెత్తిపోతున్నారు. ఇప్పటికే నెల రోజుల్లో చేసిన నష్టం అంతా ఇంతా కాదని, అధికారులు తిరిగి చూడడం లేదని పత్తి రైతులు వాపోతున్నారు. మరోసారి భారీ వర్షం తమకు మరింత నష్టాన్ని తెచ్చిపెడుతున్నదని ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి పంటలు పరిశీలించాలని, ప్రభుత్వం నుంచి పరిహారం ఇప్పించాలని కోరుతున్నారు.

## సింగూరు ప్రాజెక్టుకు పెరిగిన వరద

పుల్కల్, అక్టోబర్ 2: సంగారెడ్డి జిల్లాలోని బాగారెడ్డి సింగూరు ప్రాజెక్టుకు మళ్లీ వరద పెరిగింది. ప్రాజెక్టు అధికారులు ఎప్పటికప్పుడు నీటి హెచ్చుతగ్గులను గమనిస్తూ నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. బుధవారం ఉన్నట్టుండి వరద తీవ్రత పెరగడంతో ప్రాజెక్టు క్రస్ట్ గేటు 2 మీటర్లు ఎత్తి 10,734 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. విద్యుత్ ఉత్పత్తి కోసం జన్‌కోకు 2,822 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ఇన్‌ఫ్లో 7,263 క్యూసెక్కులు వస్తుండగా, అవుట్ ఫ్లో 13,556 క్యూసెక్కులు దిగువకు విడుదల చేసినట్లు ప్రాజెక్టు ఏఈ మహిపాల్ రెడ్డి వెల్లడించారు. ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 29.917 టీఎంసీలు ఉండగా, ప్రస్తుతం ప్రాజెక్టులో 29.917 టీఎంసీలు ఉన్నట్లు అధికారులు వెల్లడించారు.

సంగారెడ్డి జడ్పీఆవరణలో గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కలెక్టర్

## గాంధీ సిద్ధాంతాలను ఆదర్శంగా తీసుకోవాలి

**సంగారెడ్డి కలెక్టర్ వల్లూరి క్రాంతి**

సంగారెడ్డి కలెక్టరేట్, అక్టోబర్ 2: గాంధీ సిద్ధాంతాలను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి పేర్కొన్నారు. మహాత్మాగాంధీ జయంతిని పురస్కరించుకొని బుధవారం సంగారెడ్డి జిల్లా పరిషత్ కార్యాలయ ఆవరణలోని మహాత్మాగాంధీ విగ్రహానికి ఆమె పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. మహాత్మాగాంధీ దేశానికి శాంతి, అహింస, సత్యం వంటి సూత్రాల ద్వారా మార్గదర్శనం చేసిన విషయాలను గుర్తు చేశారు. గాంధీజీ అందించిన పాఠాలు నేటికీ మనకు ప్రేరణగా నిలుస్తున్నాయన్నారు. గాంధీజీ ఆశయాలు, ఆలోచనలు మన జీవితాల్లో ఎంతో ప్రాముఖ్యతను కలిగి ఉన్నాయన్నారు. కార్యక్రమంలో జడ్పీసీ ఈవో జానకీరెడ్డి, వివిధ శాఖల అధికారులు, ప్రభుత్వ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

## నేటి నుంచి డిజిటల్ కార్డుల సర్వే

- ప్రతి కుటుంబానికి డిజిటల్ కార్డులు
- మెదక్ జిల్లాలో పైలట్ ప్రాజెక్టుగా నాలుగు ప్రాంతాలు
- మెదక్, నర్సాపూర్ నియోజకవర్గాల్లో రెండు చొప్పున ఎంపిక
- 954 కుటుంబాల నుంచి వివరాల సేకరణ
- మెదక్ జిల్లాలో 11 బృందాలు ఏర్పాటు
- ఒక్కో బృందంలో నలుగురు అధికారులు

మెదక్, అక్టోబర్ 2 (నమస్తే తెలంగాణ) : నేటి నుంచి 8వ తేదీ వరకు ఫ్యామిలీ డిజిటల్ కార్డుల సర్వే చేపట్టనున్నారు. మెదక్ జిల్లాలో పైలట్ ప్రాజెక్టుగా నాలుగు ప్రాంతాలను ఎంపిక చేశారు. మెదక్ జిల్లాలోని మెదక్, నర్సాపూర్ నియోజకవర్గాల్లో రెండు చొప్పున ఎంపిక చేయగా మొత్తంగా 954 కుటుంబాల నుంచి వివరాలు సేకరిస్తారు. కుటుంబ సభ్యుల వివరాలు నమోదు చేయడమే కాక మార్పులు, చేర్పులు ఉంటే నమోదు చేయనున్నారు. కుటుంబ సభ్యులందరూ అనుమతిస్తేనే కార్డు కోసం ఫొటో తీసుకుంటారు. ఈ డిజిటల్ సర్వేలో 11 బృందాలు పాల్గొనగా, ఒక్కో బృందంలో నలుగురు అధికారులు ఉంటారు. ఆయా అధికారులు సర్వేను పరిశీలిస్తూ సిబ్బందికి సూచనలు చేస్తారు.

**954 కుటుంబాల వివరాల సేకరణ**

మెదక్ జిల్లాలో మెదక్, నర్సాపూర్ నియోజకవర్గాల్లో నాలుగు ప్రాంతాలను పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశారు. అందులో మెదక్ నియోజకవర్గంలోని చిన్నశంకరంపేట మండలం కామారం గ్రామంలో 146 కుటుంబాల వివరాలు సేకరిస్తారు. మెదక్ మున్సిపాలిటీలోని 20వ వార్డు దాయరలో 407 కుటుంబాలకు సర్వే నిర్వహిస్తారు. నర్సాపూర్ నియోజకవర్గంలోని గొల్లపల్లి గ్రామంలో 155 కుటుంబాలు, మున్సిపాలిటీ పరిధిలోని 8వ వార్డు హనుమాన్ వీధి ప్రాంతంలో 246 కుటుంబాలకు సంబంధించి డిజిటల్ ఫ్యామిలీ కార్డు సర్వే ప్రారంభిస్తారు. క్షేత్ర స్థాయిలో డిజిటల్ ఫ్యామిలీ కార్డు సర్వే నిర్వహణకు 11 బృందాలు నియమించగా, ఒక్కో బృందంలో నలుగురు అధికారులు ఉంటారు.

**డిజిటల్ కార్డు ఎందుకు..?**

రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిదారులకు రకరకాల గుర్తింపు కార్డులు ఇచ్చింది. ఆరోగ్య శ్రీ, రేషన్ కార్డు ఇలా అన్నింటినీ కలిపి డిజిటల్ కార్డు జారీ చేయాలని సర్కార్ నిర్ణయించింది. రేషన్ కార్డు, పింఛన్లు, స్వయం సహాయక సంఘాలు, రైతు భరోసా, రైతు బీమా, రుణమాఫీ, ఆరోగ్యశ్రీ, కంటి వెలుగు తదితర వివరాల డేటా ఇప్పటికే ప్రభుత్వం వద్ద ఉంది. కానీ ఇది సరైనదేనా అని నిర్ధారించుకుంటున్నారు. దీంతో ఆ కుటుంబంలో ఎవరైనా మృతి చెందితే పేర్లు తొలిగించి, కొత్త వారివి నమోదు చేస్తారు. ఆ తర్వాతనే ఫ్యామిలీ డిజిటల్ కార్డు జారీ చేయనున్నారు.

**ఆర్డీవోలు, తహసీల్దార్లకు దిశానిర్దేశం**

మెదక్ జిల్లాలో డిజిటల్ ఫ్యామిలీ కార్డు సర్వే నిర్వహణలో భాగంగా తహసీల్దార్లు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, మున్సిపాలిటీ వార్డు అధికారులకు శిక్షణ ఏర్పాటు చేయడం జరిగిందని అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు. బుధవారం సమీకృత కలెక్టరేట్‌లో జిల్లాలోని సంబంధిత ఆర్డీవోలు, తహసీల్దార్లు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, మున్సిపాలిటీ వార్డు అధికారులకు డిజిటల్ ఫ్యామిలీ కార్డుసర్వే నిర్వహణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన సదస్సు నిర్వహించినట్లు తెలిపారు.

### సర్వేకు ప్రజలు సహకరించాలి

డిజిటల్ ఫ్యామిలీ కార్డు సర్వేకు ప్రజలు సహకరించాలి. జిల్లాలో రెండు నియోజకవర్గాల్లో డిజిటల్ ఫ్యామిలీ కార్డు సర్వే చేపట్టడానికి పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్తున్నాం. పైలట్ ప్రాజెక్టుగా మెదక్ నియోజకవర్గంలో రెండు ప్రాంతాలు, నర్సాపూర్ నియోజకవర్గంలో రెండు ప్రాంతాలను ఎంపిక చేశాం. 11 బృందాలను నియమించాం. 3వతేదీ నుంచి 8వతేదీ వరకు సర్వే కొనసాగనున్నది.

**– వెంకటేశ్వర్లు, మెదక్ అదనపు కలెక్టర్**

## ఫార్మాసిటీ భూ బాధితులకు అండగా బీఆర్ఎస్

**నేడు సంగారెడ్డి జిల్లా డప్పూర్‌కు రానున్న మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు**

జహీరాబాద్, అక్టోబర్ 2: సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్ మండలంలోని డప్పూర్, వడ్డి, మల్లి గ్రామ శివారులో ప్రభుత్వం ఏర్పాటు చేయనున్న ఫార్మాసిటీలో భూములు కోల్పోతున్న బాధితులకు బీఆర్ఎస్ అండగా ఉండనున్నది. గురువారం ఆయా గ్రామాలకు చెందిన భూబాధితులు, ప్రజలను కలిసి సమస్యలను తెలుసుకుని అండగా ఉండేందుకు మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు రానున్నట్లు బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రవీందర్ తెలిపారు. ఆయనతోపాటు బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి, జహీరాబాద్ ఎమ్మెల్యే కోనింటి మాణిక్‌రావు, ఎమ్మెల్సీ యాదవరెడ్డి, ఉమ్మడి జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్, నారాయణఖేడ్, అందోల్ మాజీ ఎమ్మెల్యేలు భూపాల్‌రెడ్డి, క్రాంతికిరణ్, మాజీ ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నరోత్తం హాజరుకానున్నారు. మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన భూబాధితులు, ప్రజలు అధిక సంఖ్యలో హాజరుకావాలని ఆయన సూచించారు.

సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లో విలేకరులతో మాట్లాడుతున్న బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి, నాయకులు

## ప్రజాక్షేత్రంలో ఆలోచించి మాట్లాడాలే..

- కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు అంటే మైనంపల్లికి వెన్నులో వణుకు..
- దమ్ముంటే గజ్వేల్, సిద్దిపేటలో జరిగిన అభివృద్ధి మెదక్‌లో చేసి చూపించు
- బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్, అక్టోబర్ 2: ప్రజాక్షేత్రంలో మాట్లాడేటప్పుడు ఆలోచించి మాట్లాడాలని, కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావుపై ఎలా పడితే అలా మాట్లాడితే మైనంపల్లి నోటికి తాళం వేస్తామని బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి హెచ్చరించారు. బుధవారం సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లో మున్సిపల్ చైర్మన్ రాజమౌళితో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గజ్వేల్‌లో మైనంపల్లి కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావుపై మాట్లాడిన తీరును తీవ్రంగా ఖండించారు. మైనంపల్లికి ఆ ముగ్గురు అంటే వెన్నులో వణుకు పుడుతుందన్నారు. నీకు దమ్మూధైర్యం ఉంటే గజ్వేల్, సిద్దిపేటలో చేసిన అభివృద్ధిని మెదక్‌లో చేసి చూపెట్టాలని, ఇప్పుడు ఉన్నది నీ ప్రభుత్వమే కదా అన్నారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో రూ.170కోట్లు మంజూరు చేసి ప్రొసీడింగ్ కాపీలు ఇస్తే వాటిని రద్దు చేసి సీఎం రేవంత్‌రెడ్డి కొడంగల్‌కు తరలించారన్నారు. దమ్ముంటే ఆ నిధులను వెనక్కి తెచ్చి గజ్వేల్ అభివృద్ధికి కేటాయించాలన్నారు. కొండపోచమ్మ, మల్లన్నసాగర్ ముంపు బాధితులపై మైనంపల్లి మొసలి కన్నీరు కారుస్తున్నారన్నారు. ప్రాజెక్టులు నిర్మించి కాల్వల ద్వారా ఇతర జిల్లాలకు సాగునీరు అందించిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. మల్లన్నసాగర్ నిర్వాసితులకు చాలావరకు పరిహారం చెల్లించారని, మల్లన్న, కొండపోచమ్మసాగర్ నిర్వాసితులకు దాదాపు రూ.440 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయని, ఇతరత్రా కారణాలతో మిగిలిన రెండు శాతం మందికి పరిహారాన్ని అందించలేకపోయామన్నారు. అబద్ధపు, అసత్యపు హామీలతో గద్దెనెక్కి 10 నెలలు గడుస్తున్నా రేవంత్ సర్కార్ ఆర్‌అండ్‌ఆర్ కాలనీకి రూపాయి కూడా విడుదల చేయలేదన్నారు. మైనంపల్లి హన్మంతరావు అబద్ధాలు మాట్లాడుతున్న తీరు చూస్తే దయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందన్నారు. సమావేశంలో వైస్ చైర్మన్ జకీయొద్దీన్, కౌన్సిలర్లు మెట్టయ్య, అత్తెల్లి శ్రీనివాస్, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

సంగారెడ్డిలో అక్రమ నిర్మాణ కూల్చివేతలో గాయపడిన హోంగార్డ్ గోపాల్‌ను పరామర్శిస్తున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి, ఎస్పీ రూపేశ్

## కదిలిన యంత్రాంగం

- హోంగార్డు గోపాల్‌ను పరామర్శించిన సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి, ఎస్పీ రూపేశ్
- మాజీ మంత్రి హరీశ్‌రావు సూచనలతో స్పందించిన అధికారులు

సంగారెడ్డి కలెక్టరేట్, అక్టోబర్ 2: ఇటీవల సంగారెడ్డిలో అక్రమ నిర్మాణాల కూల్చివేతలో గాయపడిన హోంగార్డు గోపాల్‌ను ఎట్టకేలకు జిల్లా ఉన్నతాధికారులు పరామర్శించారు. స్థానిక ఎమ్మెల్యే చింతా ప్రభాకర్‌తో కలిసి మాజీమంత్రి తన్నీరు హరీశ్‌రావు మంగళవారం ఏఐజీ దవాఖానలో చికిత్స పొందుతున్న హోంగార్డు గోపాల్‌ను పరామర్శించిన విషయం తెలిసిందే. ఇప్పటివరకు ప్రభుత్వ అధికారులు గోపాల్‌ను పరామర్శించక పోవడంపై హరీశ్‌రావు అసంతృప్తి వ్యక్తం చేశారు. కనీస జాగ్రత్తలు తీసుకోకుండా కొండాపూర్ మండలం మల్కాపూర్‌లో అక్రమ నిర్మాణాలను డిటోనేటర్లతో కూల్చివేసిన సమయంలో హోంగార్డు గాయపడడం దురదృష్టకరమన్నారు. ఇందుకు స్పందించిన సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి, ఎస్పీ రూపేశ్, జిల్లా వైద్యాధికారి గాయత్రీదేవిలతో కలిసి గచ్చిబౌలిలోని ఏఐజీ దవాఖానలో చికిత్స పొందుతున్న హోంగార్డు గోపాల్‌ను బుధవారం పరామర్శించా రు. దవాఖాన చైర్మన్ డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డితో చర్చ లు జరిపారు. గోపాల్‌కు మెరుగైన వైద్యం అందించాలని కలెక్టర్ సూచించారు. హోంగార్డు గోపాల్‌కు జరిగే అన్ని వైద్య ఖర్చులను ప్రభుత్వమే భరిస్తుందని కలెక్టర్ పేర్కొన్నారు. ఎస్పీ రూపేశ్ మాట్లాడుతూ పోలీసు శాఖ గోపాల్ కుటుంబానికి అండగా ఉంటుందన్నారు.